క్లుప్తంగా

ఇనమనమెళ్లూరు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశాలు పొందినట్లు హెచ్ఎం నాగకల్యాణి తెలిపారు. లక్ష్మి రిషిక నూజివీడు, వర్షిణి శ్రీకాకుళం, లక్ష్మీ అక్షయ ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశాలు పొందినట్లు చెప్పారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

యరజర్లలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరటి మొక్కలు పెంచుకుని మంచి లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి వాకా మాధవి అన్నారు. మండలంలోని యరజర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పెరటి మొక్కల పెంపకం, లాభాలు, ఆరోగ్యం, తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. యరజర్ల ఆర్‌బీకేలో వీఏఏ కోటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నేల పదునైందని తెలిపారు. పెరటి మొక్కలు పెంచుకునేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అధికారులు విత్తనాలు అందజేశారని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ మహిళా సంఘ సభ్యులు 11 రకాల విత్తనాలను కిట్లుగా రూపొందించి గ్రామ మహిళా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో యరజర్ల కార్యదర్శి రామకృష్ణ, ఆర్‌బీకే వీఏఏ కోటేశ్వరరావు, సుభాషిణి, షేక్ రజియా, మహిళా సంఘ సభ్యులు, లీడర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన ఎంపీపీ, అధికారులు


అంగన్‌వాడీ కేంద్రంలో చర్చిస్తున్న ఎంపీపీ, అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని గుండాయపాలెం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఒంగోలు ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో పి.అజిత శుక్రవారం పరిశీలించారు. జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. గృహ నిర్మాణాలకు వాడుతున్న ఇటుక రాయి, సిమెంటు నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ పృథ్వీకి పలు సలహాలు, సూచనలు చేశారు. వారి వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయితేజ ఉన్నారు. అనంతరం అంగన్‌వాడీ భవనాన్ని సందర్శించారు. భవనం రిపేర్ల నిమిత్తం చుట్టూ ఉన్న మొక్కలు తొలగించేందుకు నిధులు కేటాయిస్తామని ఎంపీపీ తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న జగనన్న లే అవుట్లలోని ద్వారబంధం ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో హైస్కూలుగా అప్‌గ్రేడ్ అయిన యూపీ స్కూలు భవన నిర్మాణాలను హౌసింగ్ డీఈ నారాయణరెడ్డితో కలిసి ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పేతురు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల ఆత్మీయ కలయిక రేపు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా మాదిగ ఉద్యోగుల ఆత్మీయ కలయిక ఈనెల 16న స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్నారు. మాదిగ ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఈతముక్కలలో జగనన్న లే అవుట్ల పరిశీలన


జగనన్న లే అవుట్లను పరిశీలిస్తున్న పీడీ పేరయ్య

ఈతముక్కల (కొత్తపట్నం): ఈతముక్కల గ్రామంలోని జగనన్న లే అవుట్లను హౌసింగ్ పీడీ ఈ పేరయ్య శుక్రవారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను తనిఖీ చేశారు. బేస్‌మట్టం ఎంత మంది వేశారు, ఎంత మందికి బిల్లులు పడ్డాయి, బేస్‌మట్టం వేయని వాళ్ల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అక్టోబర్ నెలాఖరుకు జగనన్న గృహాలు పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలని కోరారు. బేస్‌మట్టం అయిన వెంటనే బిల్లుల నగదు అకౌంట్‌లో జమచేస్తామన్నారు. సిమెంట్, ఐరన్, కిటికీలు, డోర్లు, ఇసుక సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, డీఈ నారాయణరెడ్డి, ఏఈ నాంచార్లరెడ్డి, ఈఓ సింధు, ఏపీఎం షేక్ రజియాసుల్తాన్‌బేగం, చింపిరయ్య పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా..
సర్టిఫికెట్ల అందజేత

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


చంద్రపాడులో సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


వెంగముక్కలపాలెంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జేసీ శ్రీనివాసరావు, మేయర్ గంగాడ సుజాత

చీమకుర్తి: దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. శుక్రవారం చీమకుర్తి మండలం చంద్రపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి బూచేపల్లి వెంకాయమ్మతో పాటు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందేందుకు కావాల్సిన సర్టిఫికెట్లు లేకపోవడంతో పథకాలు పొందలేని వారికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సర్టిఫికెట్లు కావాల్సిన వారికి వారి గ్రామాల్లోనే అధికారులంతా వచ్చి అప్పటికప్పుడే సర్టిఫికెట్లు సిద్ధం చేసి పంపిణీ చేయడం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయం సిబ్బంది సిద్ధం చేసిన సర్టిఫికెట్లను బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెంలో...

సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పాల్గొని ఆయన చేతుల మీదుగా పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ ఉషారాణి, సర్పంచ్ మారెడ్డి విజయలక్ష్మి పవన్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ కంచి మాధవి, దుంపా యలమందారెడ్డి, స్థానిక అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మద్దులూరులో సర్పంచ్ బీ శైలజ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి సర్టిఫికెట్లు అందించారు.

జగనన్న సంక్షేమ పాలనలో రాష్ట్రం సుభిక్షం: ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సీఎం జగనన్న సంక్షేమ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి, గుండ్లాపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గుండ్లాపల్లి సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పరిపాలన సాగిస్తున్నారన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. పథకాలు అందలేదని ఎవరూ చెప్పకుండా ఉండాలని, అందుకు అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం ఏర్పాటు చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో పథకాలు ఏం ఇచ్చారో చెప్పాలని ఆయన కోరారు. పసుపు, కుంకుమ అంటూ పసుపు ఒకసారి, కుంకుమ ఒకసారి ఇచ్చిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. త్వరలో నియోజకవర్గంలో జరిగే మా ఊరు.. మా ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రతి గ్రామంలో 2014–19లో జరిగిన అభివృద్ధి పనులు, 2019 నుంచి జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీటీసీ పద్మకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, స్పెషల్ ఆఫీసర్ వరకుమార్, తహసీల్దార్ రజనీకుమారి, ఏఓ సుబ్బారావు, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గట్టినేని అయ్యన్న, గుడ్డపాతల రవి, పిట్టల ఆంజనేయులు, ఎంపీటీసీలు పైనం ప్రభాకర్, పద్మ, లింగా రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, సన్నపురెడ్డి రమణమ్మ, వేణు, కొప్పోలు కారంపూడి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో...

గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ ఆశా జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు పిచ్చిరాజు, సుబ్బారెడ్డి, సర్పంచ్ అనిల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

అట్టడుగున ఉన్నవారికి కూడా సంక్షేమ పథకాలు అందాలి : ఆర్డీవో విశ్వేశ్వరరావు

గమళ్లపాలెం (కొత్తపట్నం): అట్టడుగున ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం సంక్షేమ పథకాలు అందాలని ఆర్డీవో విశ్వేశ్వరరావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గమళ్లపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామస్తులు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కొత్తపట్నం–2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కొత్తపట్నంలో 420 మందికి, గమళ్లపాలెంలో 590 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, డీటీ అర్జున్‌రెడ్డి, తాత నాంచార్లు, వెంకటనారాయణ, తాత శ్రీను, బలగాని నారాయణ, బలగాని వెంకటేశ్వరరావు, తాత శ్రీనివాసరావు, తుళ్లూరి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సందీప్, వాయల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల కోసమే జగనన్న సురక్ష : ఎంపీపీ మల్లికార్జునరెడ్డి

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ అన్ని పథకాలు వర్తింపజేసేందుకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం గుండాయపాలెంలో సర్పంచ్ రేవు సౌజన్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి, ఎంపీడీవో పి.అజిత, వైఎస్సార్ సీపీ నాయకులు పేతురు, బాబులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అన్ని సర్టిఫికెట్లు ఉచితం : ఎమ్మెల్యే టీజేఆర్

నాగులుప్పలపాడు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అన్ని సర్టిఫికెట్లు ఉచితంగానే అందిస్తున్నట్లు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నాగులుప్పలపాడు, ముప్పాళ్ల సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులకు పలు సర్టిఫికెట్లు అందించారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, ఆరోగ్యశ్రీ స్పెషల్ అధికారి యాదల అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కూనం పూర్ణచంద్రరావు, ఘట్టినేని అయ్యన్న, తుమ్మల బ్రహ్మానందరెడ్డి, అన్నెం వెంకట్రామిరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్, పులిచర్ల పరంధామిరెడ్డి, వైకుంఠ వీరాంజనేయులు, దశరధరామయ్య, కుమ్మారి సుధాకర్, నాగులుప్పలపాడు, ముప్పాళ్ల గ్రామాల సర్పంచ్లు మందా హెప్సీరాణి, వైకుంఠ పద్మశ్రీ, మద్దిసాని రాజేష్, వడ్డిముక్కల శ్రీను, ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రతి ఇంటికీ మేలు : జేసీ శ్రీనివాసులు

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రతి ఇంటికి మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. నగరంలోని మూడు సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. 18వ డివిజన్ వెంగముక్కలపాలెం సచివాలయం పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మేయర్ గంగాడ సుజాత, తదితరులు పాల్గొన్నారు. నగరంలోని భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు సచివాలయాల పరిధిలోనూ జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు ఈదర సురేష్ బాబు, పసుపులేటి విజయలక్ష్మి శ్రీనివాసరావు, ఇమ్రాన్‌ఖాన్, అంబటి ప్రసాదు, యనమల నాగరాజు, చింతపల్లి గోపీచంద్, సర్తాజ్, నీలం రాజు సరోజ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొమ్మూరి రవిచంద్ర, నాయకులు ఎం.అంజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, హౌసింగ్‌బోర్డులో డివిజన్ అధ్యక్షుడు ఆర్.రాజేష్, పార్టీ నాయకులు కరుణాకర్, భాగ్యనగర్ రవి, సురేష్, పృథ్వీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.


గుండ్లాపల్లిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


గమళ్లపాలెంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు


గుండాయపాలెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీవో


ముప్పాళ్ల సచివాలయంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, నాయకులు

రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ నరసింహులు

కొత్తపట్నం: రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని, అందులో భాగంగా కాంప్లెక్ట్ బ్లాక్ విధానంలో పంటలు సాగుచేస్తే రైతుకు ఎంతో ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయం మండల మాస్టర్ ట్రైనర్ నరసింహులు తెలిపారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆదేశాల మేరకు ఒక ఏరియాలో ప్రకృతి వ్యవసాయం చేసే 5 నుంచి 10 మంది రైతులతో కాంప్లెక్ట్ బ్లాక్ విధానాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ కాంప్లెక్ట్ బ్లాక్ విధానం ద్వారా ఒక ఏరియాలోని రైతులంతా ఎటువంటి క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు వాడకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేయడం జరుగుతుందన్నారు. సరిహద్దు పంటలు, అంతర్ పంటలు, ఎర్ర పంటల విధానాన్ని అచరించడం మంచిదని వివరించారు. అంతేగాకుండా ఈ ఏరియాలో ప్రతి బుధవారం పెస్ట్ సర్వైలెన్స్ నిర్వహిస్తామన్నారు. పెస్ట్ సర్వైలెన్స్‌లో పంట ఎదుగుదలలో వచ్చే మార్పులు, పురుగులు, తెగుళ్లు, పంట యాజమాన్యం, సస్యరక్షణపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించారు. అందులో భాగంగా పురిణి మల్లేశ్వరి పొలం చుట్టూ ఉన్న కాంప్లెక్స్ బ్లాక్‌లో పసుపు, బ్లూ అట్టలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రెడ్డెప్ప, మల్లేశ్వరి, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమోటాలు

ఒంగోలు నగరంలోని మూడు రైతు బజార్లలో ప్రజలకు అందజేత

ఒంగోలు సబర్బన్: సబ్సిడీపై టమోటాలను ప్రజలకు అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా ఒంగోలు నగరంలోని మూడు రైతు బజార్లలో టమోటాలను అందుబాటులో ఉంచింది. చిత్తూరు జిల్లా మదనపల్లి, పలమనేరు ప్రాంతాల నుంచి టమోటాలను జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ కేవీఎస్ ఉపేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని రైతు బజారుతో పాటు లాయర్‌పేట రైతు బజారు, దిబ్బల రోడ్డులోని రైతు బజారులో సబ్సిడీపై అందిస్తున్నారు. ఒక్కొక్కరికి కిలో చొప్పున రూ.50కి పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా కిలో రూ.120 వరకూ ధర పలుకుతోంది. పంట తక్కువ కావడం, అకాల వర్షాల కారణంగా టమోటాకు గిరాకీ పెరిగింది. రెండు వారాలుగా టమోటాను సబ్సిడీపై ఒంగోలు నగర ప్రజలకు అందిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 13 టన్నులకుపైగా టమోటాలను సబ్సిడీపై అందించామని ఏడీ ఉపేంద్రకుమార్ తెలిపారు.


రైతు బజార్‌లో సిద్ధంగా ఉన్న టమోటాలు


ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్‌లోని రైతు బజార్‌లో సబ్సిడీపై టమోటాల కోసం క్యూ కట్టిన ప్రజలు

విద్యుత్ బిల్లుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- ఉద్యోగులను హెచ్చరించిన ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్దన్‌రెడ్డి


విద్యుత్ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్దన్‌రెడ్డి

ఒంగోలు సబర్బన్: విద్యుత్ బిల్లులు తీసే విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్దన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక విద్యుత్ భవన్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్ ఉద్యోగులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ఉద్యోగుల ప్రధాన బాధ్యత విద్యుత్ బిల్లింగ్ వ్యవహారమన్నారు. బిల్లులపై సిబ్బంది, అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా బిల్లులను స్కానింగ్ ద్వారానే తీసే విధంగా మీటర్లు మార్చాలని సూచించారు. సంస్థకు నష్టం తెస్తున్న వారిని ఉపేక్షించేది లేదన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సిబ్బంది, అధికారులు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ వినియోగదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతిఒక్క వినియోగదారుడు సంస్థకు ఎంతో ముఖ్యమన్నారు. వినియోగదారుడు ఫోన్ చేస్తే వెంటనే స్పందించడం మనందరి బాధ్యతని సూచించారు. అదేవిధంగా వేసవిలో విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా చేసినందుకు సిబ్బందిని సీఎండీ అభినందించారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ జయభారత్‌రావు, సీజీఎం వెంకటేశ్వర్లు, ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఈఈలు, డీఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, విద్యుత్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


సంఘటన స్థలంలో గాయాలతో ఏసోబు

మద్దిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మద్దిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి జాతీయ రహదారిపై మద్దిపాడు సమీపంలోని రెనాల్ట్స్ షోరూమ్ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సంతనూతలపాడు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కందుల ఏసోబు, రాయపూడి విల్సన్ 11 గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై మద్దిపాడు వైపు నుంచి ఒంగోలుకు రాంగ్ రూట్‌లో వెళ్తుండగా మోటార్ సైకిల్ మట్టిగుట్టపైకి ఎక్కింది. దాంతో వెనుక కూర్చున్న విల్సన్ కిందపడిపోగా ఏసోబు జాతీయ రహదారిపై రెండో లైన్‌లో పడిపోయాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి విజయవాడవైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఏసోబు ఎడమ కాలు, చేతిపైకి ఎక్కడంతో నుజ్జునుజ్జయ్యాయి. తలకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ఏసోబు (20)ను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందినట్లు మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి

పట్నంబజారు (గుంటూరు): రహదారి భద్రతే ధ్యేయంగా పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తోందని, ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రవాణా శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ డాక్టర్ బి.కృష్ణవేణి కోరారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడంపై దృష్టి సారించాలన్నారు. విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. లారీలు, ట్రాక్టర్లు, ఆటోల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. త్రైమాసిక పన్నులు నిర్ణీత సమయంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, నిర్ణీత సమయంలో చెల్లించకపోతే వారికి అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు తనిఖీల్లో పట్టుబడి సీజ్‌చేసిన వాహనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో జరిమానాలు చెల్లించిన వాహనాలను మాత్రమే విడుదల చేయాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల డీటీసీలు, ఇతర అధికారులు షేక్ కరీం, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలలో గెస్ట్ టీచర్లుగా పనిచేసేందుకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గురుకుల విద్యాలయాల కో ఆర్డినేటర్ డీ జయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్, సివిక్స్, మ్యాథ్స్, హిందీ, ఇంగ్లిష్, జువాలజీ, పీఈటీ పోస్టులకు ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు డిగ్రీ, పీజీ ఇంగ్లిష్ మీడియంలో చదివిన వారు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా మార్కాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 19న ఉదయం 10 గంటలకు డెమా క్లాసులు నిర్వహించి ఎంపిక చేస్తామని చెప్పారు.

డీఈఈ సెట్ విద్యార్థులకు నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ డైట్ కాలేజీలో డీఈఈ సెట్ ద్వారా కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన విద్యార్థులకు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రొవిజినల్ అడ్మిషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్హతలు, ఆదాయం, కులం, ర్యాంక్ కార్డులకు సంబంధించిన సర్టిఫికెట్ల ఒరిజినల్ సెట్‌తోపాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలు తీసుకురావాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 99633 92348 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.